


## చిన్నమాట

కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజిలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.

కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.

తెలుగులో ఆ950–ఆ960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.

విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్ధమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.

చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.

అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...

మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.

# చల్లటి అడవి

## కథ పేరు: కోల్డ్ ఉడ్స్

## { జోసెఫ్ పేనీ బ్రెన్నన్ కథకి స్వేచ్ఛానువాదం}

## కథాకాలం 1984

**ఆ చలికాలం** చలి ఎంతగా పెరిగిందంటే ఆర్కిటిక్ నించి చలిగాలులు సరాసరి వస్తున్నాయా అనిపించసాగింది.

జూనిపర్ హిల్ గ్రామంలోని రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ దేవ్ దళసరి స్వెటర్ ధరించినా, షెడ్‌లోంచి పైన్ కట్టెలని ఇంట్లోకి తేవడానికి వెళ్ళిన కొద్ది నిమిషాలు చలికి వణికిపోయాడు. షెడ్ తలుపు మూసి తన వంటగదిలోని కట్టెల పెట్టెలో మోపుని దింపి ఫైర్ ప్లేస్ దగ్గరికి చలి కాచుకోడానికి వెళ్ళాడు. చలికి మొద్దుబారిన తన చేతివేళ్ళని మంట దగ్గర ఉంచాడు.

కొన్నేళ్ళ క్రితం ఇలాంటి వాతావరణంలో తను నడకకో, వేటకో వెళ్ళినప్పుడు ఆ చలిని తట్టుకోగలిగేవాడు. కానీ ఆ రోజులు తన జీవితంలోంచి పోయాయి అనుకున్నాడు.

తర్వాత దేవ్ కిటికీ దగ్గరికి వెళ్ళి బయట కనిపించే మంచులో కప్పబడ్డ కొండ శిఖరాలని, భూమిని, చెట్లని చూడసాగాడు. అంతా తెల్లగా కనిపించే ఆ దృశ్యం ఎంతసేపు చూసినా తనివి తీరదు. కత్తిలా కోసే చలిగాలివల్ల, చలి తీవ్రతవల్ల ఏ జీవీ కదలడం లేదు. ఆఖరికి చిమటలు కూడా చలినించి భద్రతగల ప్రదేశాల్లో దాక్కున్నాయి.

ఆయన వంటగది కిటికీ ముందు నించి కదలబోయి ఆగి, కళ్ళు చికిలించి చూసాడు. ఏదో దూరంగా కదలుతూ కనిపించడంతో ఆసక్తిగా ఆగిపోయాడు. క్రమంగా అది మనిషి ఆకారమని గ్రహించాడు ఆ మనిషి నెమ్మదిగా కదులుతూ ఆగి, విశ్రాంతి తీసుకుని మళ్ళీ ముందుకి కదలసాగాడు అతని చేతిలో తుపాకీ లేకపోవడంతో వేటగాడు కాదు అనుకున్నాడు. ఈ చలిలో నడక కోసం ఎవరు బయటకి వస్తారు?

అతను తన ఇంటి సమీపానికి వచ్చాక నడకని బట్టి అతను ఎవరో ఆయన గుర్తుపట్టాడు.

ఆలివర్!

ముప్పై రెండేళ్ళ దురదృష్టపు రైతు. షెల్విన్ ఇంట్లో పేయింగ్ గెస్ట్‌గా నివసించే అతను బంగారం ముట్టుకున్నా మట్టే అవుతూంటుంది.

ఆలివర్ వచ్చేసరికి తన ఇంటి వెనక తలుపుని సిద్ధంగా తెరచి ఉంచి, అతను లోపలకి రాగానే తలుపు మూస్తూ చెప్పాడు.

"మంట దగ్గరకి వెళ్ళు ఆలివర్. నేను వేడి టీ కాస్తాను."

ఆలివర్ మారుమాట్లాడకుండా వణుకుతూ ఫైర్ ప్లేస్ దగ్గరకి వెళ్ళి నిలబడ్డాడు. దేవ్ టీ కెటిల్‌ని పొయ్యి మీద ఉంచాడు. కొన్ని నిమిషాలు గడిచాక కాని ఆలివర్ మాట్లాడలేకపోయాడు.

"చలితో నా నోరు గడ్డకట్టినట్లైంది. నాకు ఇంత చలిరోజు గుర్తులేదు."

"ఇంత చలిలో ఎందుకు బయటకి వచ్చావు? ఏమిటంత జరూరు పని?" దేవ్ టీ కపుని అందిస్తూ ప్రశ్నించాడు.

"నేను, హార్వే పైన్ వృక్షాలని కొడుతున్నాం. మేం పని మొదలుపెట్టినప్పుడు ఇంత చలిగా లేదు" ఇంకా వణికే ఆలివర్ చెప్పాడు.

"అతనేడి?" వెంటనే దేవ్ ప్రశ్నించాడు.

"ఓ చోట ఉన్నాడు. అతని మడమ బెణికింది. లేదా విరిగిందేమో? నడవలేక ఆగిపోతే నేను మాత్రం సహాయానికి ఇక్కడికి వచ్చాను."

"అయ్యో! చలికి గడ్డ కట్టుకుని మరణిస్తాడు. నువ్వు అతన్ని వదిలి రాకుండా ఉండాల్సింది" వెంటనే దేవ్ బాధగా చెప్పాడు.

తల అడ్డంగా ఊపుతూ ఆలివర్ చెప్పాడు.

"పాత కేబిన్‌లో ఉన్నాడు. అతన్ని అక్కడిదాకా మోసుకెళ్ళాను. లోపల ఓ బంక్. ఓ ఫైర్ ప్లేస్, చాలా కట్టెలు ఉన్నాయి. నిప్పు రాజేసాను. ఆకలికి నకనకలాడుతాడు తప్ప గడ్డకట్టి చావడు."

దేవ్ ముఖం చిట్లించి కిటికీలోంచి బయటకి చూసాడు. అప్పటికే సూర్యాస్తమయం ఆరంభమవడంతో వెలుగు తగ్గింది.

"ఈ రాత్రి ఎవరూ అక్కడికి అతన్ని కాపాడటానికి వెళ్ళలేరు. వెళ్ళినా చీకట్లో తప్పిపోతారు. ఆ కేబిన్ గ్రామం నించి ఏడు మైళ్ళుంటుంది."

"దాదాపు ఎనిమిది మైళ్ళు. ఈ రాత్రి లాభంలేదు. రేపు ఉదయం ఓ స్లెడ్జ్ బండిని తీసుకుని వెళ్ళాలి. కనీసం నలుగురి సహాయం అవసరమౌతుంది" దేవ్ చెప్పాడు.

హార్వే ఆలివర్ కన్నా చిన్నవాడు. బలిష్టుడు. కాని ఇలాంటి చలి రాత్రి ఒంటరిగా ఓ పాత కేబిన్‌లో గడపటం నరకం అని దేవ్ అనుకున్నాడు.

"ఆ కేబిన్ గాలిదూరని విధంగా ఉండదనుకుంటాను ఆలివర్" దేవ్ ప్రశ్నించాడు.

"కిటికీ అద్దం పగల్లేదు. దాని తలుపు పనిచేస్తోంది. కాకపోతే చాలా చిల్లుల్లోంచి గాలి లోపలకి వెళ్తుంది" ఆలివర్ చెప్పాడు.

"నువ్వు ఏం తినలేదు అనుకుంటా?"

"ఇంట్లోంచి బయలుదేరినప్పుడు ఓ చాక్లెట్ బార్‌ని మాత్రం తిన్నాను. హార్వే దగ్గర చూయింగ్ గమ్స్ ఉన్నాయి."

దేవ్ ఖాళీ అయిన ఆలివర్ కప్పులో మళ్ళీ టీ నింపి చెప్పాడు.

"రేపు ఉదయందాకా వేచి ఉండటం మంచిదికాదు. ఇంటికి వెళ్తూ గ్రామంలో అందరికీ చెప్పు. సహాయానికి వచ్చేవాళ్ళని రేపు ఉదయం ఇక్కడ కలవమను. ఐదారుగురు ఉండటం ఉత్తమం."

ఆలివర్ టీ తాగుతూ తలూపాడు.

"టీకి థాంక్స్. ఇంక నేను గ్రామానికి బయలుదేరుతాను. రేపు ఉదయం కలుద్దాం."

కొద్దిసేపటికి దేవ్ గిన్నెడు వేడి గొర్రె మాంసం స్ట్యూని తాగుతూ హార్వే ఆ రాత్రి ఆకలితో నకనకలాడుతాడని బాధగా అనుకున్నాడు.

దేవ్ ఉదయం ఐదుకే నిద్రలేచాడు. ఇల్లు బాగా చల్లబడింది. స్టవ్ మీద పైన్, బిర్చ్ పేళ్ళని ,బెరళ్ళని అమర్చాడు. బ్రేక్‌ఫాస్ట్ సిద్ధం చేసుకునేసరికి ఆ మంటకి వంటగదిలోని చలి బాగా తగ్గింది. ఉడకపెట్టిన రెండు గుడ్లు, ఓట్‌మీల్ తిన్నాక కిటికీ దగ్గరకి నడిచాడు. బయటున్న థర్మామీటర్ మైనస్ పన్నెండు చూపిస్తోంది. సూర్యుడు పైకి వచ్చేకొద్దీ అది పదికి చేరుకోవచ్చు అనుకున్నాడు.

తలుపు చప్పుడు విని కాఫీ తాగే దేవ్ వెళ్ళి దాన్ని తెరిస్తే మార్క్, జాక్, వెస్లీలు లోపలకి వచ్చారు. వెంటనే తలుపు మూసి దేవ్ అడిగాడు.

"ఆలివర్ ఏడీ?"

ఆ ముగ్గురూ వేగంగా ఫైర్ ప్లేస్ దగ్గరకి నడిచారు.

"నిన్న రాత్రి చలిలో గడపడం వల్ల ఆలివర్‌కి జ్వరం వచ్చిందని షెల్విన్ చెప్పింది. అందుకని రావద్దన్నాం."

"మీ ముగ్గురూ ఆ చెట్లలో స్లెడ్జ్ మీద హార్వేని ఉంచి లాగడం కష్టం. కనీసం నలుగురు వస్తారు అనుకున్నాను" దేవ్ అసంతృప్తిగా చెప్పాడు.

"ఆలివర్ గ్రామంలోని అందర్నీ సహాయం కోరానని చెప్పాడు. బ్రౌన్ గ్రామంలో లేడు. హెన్రీ భార్యకి ఏదో అనారోగ్యం. జేసన్‌కి ఏదో వ్యాపారపని ఉందిట."

"సరే నేను ఆరుగురికి కాఫీ కాచాను. వెలుతురు పూర్తిగా వచ్చేదాకా ఆగండి. సరే. నేను కూడా మీతో వస్తాను" చెప్పాడు.

ముగ్గురూ వెంటనే ఒకరి మొహాలు మరొకరు చూసుకున్నారు.

"కాని ఇవాళ నిన్నటికన్నా బాగా చలిగా ఉంది" జాక్ హెచ్చరించాడు.

"పైగా చాలా దూరం నడవాలి" వెస్లీ చెప్పాడు.

"నేను పుట్టి పెరిగింది ఇక్కడే. చిన్న తప్పు మలుపు తీసుకుంటే మీరు అడవిలో తప్పిపోతారు."

ఆ నలుగురూ ఐదు నిమిషాల తర్వాత దేవ్ ఇంట్లోంచి బయటకి నడిచారు.

అక్కడక్కడా ఆగి విశ్రాంతి తీసుకుంటూ మళ్ళీ ముందుకి కదలసాగారు. మార్క్ తనతో ఫ్లాస్క్‌లో తెచ్చిన విస్కీని అందరికీ తెచ్చి తనూ తాగాడు.

సూర్యుడు పైకి వచ్చేకొద్దీ ఉష్ణోగ్రత పెరగసాగింది. అది వారి అసౌకర్యాన్ని కొద్దిగా తగ్గించింది. రెండు గంటల తర్వాత వాళ్ళు పైన్ వృక్షాలని నరికే చోటికి చేరుకున్నారు.

"నాకు ఆకాశంలో కేబిన్ వైపు నించి పొగేం కనపడటంలేదు. చిమ్నీలోంచి కట్టెల పొగ రావాలి" దేవ్ ఆలోచనగా ఓ వైపు చూస్తూ చెప్పాడు.

"నువ్వు రావడం మంచిదైంది దేవ్. మాకు దారి చూచాయగానే తెలుసు" జాక్ చెప్పాడు.

"హార్వేకి నేను చేయగలిగే సహాయం ఇదే" దేవ్ జవాబు చెప్పాడు.

నలుగురూ అటువైపు నడక వేగాన్ని పెంచారు. కొద్దిసేపట్లో దేవ్ ఆ పాత చెక్క కేబిన్ తలుపు తెరచుకుని లోపలకి వెళ్ళాడు. లోపల చీకటిగా, బాగా చల్లగా ఉంది.

"హార్వే!" జాక్ గట్టిగా పిలిచాడు.

బదులు లేదు.

"నిద్రపోతున్నట్లున్నాడు" మార్క్ చెప్పాడు.

బంక్ మీద వెల్లకిలా పడుకుని ఉన్న హార్వే కళ్ళు పై కప్పు వంక చూస్తూ తెరచి ఉన్నాయి. అతను మరణించాడని గ్రహించిన మార్క్ ఛాతీమీద చెవిని ఆనించి గుండె చప్పుడు కోసం చుసాడు. అది కొట్టుకోవడం లేదని గ్రహించాడు.

"గడ్డకట్టి మరణించాడు" మార్క్ బాధగా చెప్పాడు.

"నిద్రపోతూండటంతో చలికి మెలుకువ రాక కట్టెలని మళ్ళీ పొయ్యిలో పెట్టి ఉండడు. మంట చల్లారి చలికి గడ్డకట్టుకుని మరణించాడు" జాక్ ఫైర్ ప్లేస్ వంక చూసి చెప్పాడు.

"కాని హార్వే అలాంటి పొరపాటు చేసే రకం కాదు."

"అలసిపోయి ఉంటాడు. పైగా కాలి మడమ బెణకడంతో పెద్దగా కదల్లేకపోయుంటాడు."

"కట్టెల పెట్టె నిండుగా ఉంది" జాక్ దానివంక చూసి చెప్పాడు.

"వాటిని ఫైర్ ప్లేస్ దగ్గరకి తీసుకెళ్ళి పొయ్యిలో ఉంచలేనంతగా కాలి మడమ నొప్పి పుట్టి ఉంటుంది. బహుశ విరిగి ఉంటుంది. అందుకే వాచింది చూడండి" వెస్లీ చెప్పాడు.

దేవ్ ఫైర్ ప్లేస్ దగ్గరకి వెళ్ళి దానిమీది ఇనుప మూతని తెరచి చూసి చెప్పాడు.

"నాలుగు పెద్ద కట్టెలు ఉన్నాయి. కొద్దిగా నల్లబడ్డాయి తప్ప కాల్లేదు."

తర్వాత కట్టెల పెట్టె దగ్గరకి వెళ్ళి పైన ఉన్న కట్టెలని చూసాడు. పైన్, సెడార్, మేపుల్ కట్టెలు పైన పేర్చి ఉన్నాయి.

"తడిచాయి. అందుకే కాలలేదు" చెప్పాడు.

"నాలుగు పెద్ద కట్టెలు ఉన్నాయి. కొద్దిగా నల్లబడ్డాయి తప్ప కాల్లేదు."

తర్వాత కట్టెల పెట్టె దగరకి వెళ్ళి పైన ఉన్న కట్టెలని చూసాడు. పైన్, సెడార్, మేపుల్ కట్టెలు పైన పేర్చి ఉన్నాయి.

"తడిసాయి. అందుకే కాలలేదు" చెప్పాడు.

తర్వాత తల పైకెత్తి చూసి చెప్పాడు.

"నాకు ఎండ కనపడటంలేదు. బహుశ చెమ్మ చేరి కిందకి బొట్లు పడి కట్టెలు తడిసి ఉంటాయి."

"ఆలివర్ ఇక్కడే ఉండాల్సింది" జాక్ కొద్దిగా కోపంతో కూడిన బాధతో చెప్పాడు.

"ఉంటే ఒకదాని బదులు బహుశ రెండు శవాలు ఉండేవి" లెస్లీ చెప్పాడు.

జాక్ తల పైకెత్తి చూసి చెప్పాడు.

"చాలా చోట్లనించి నీళ్ళు  కిందకి కారాయి. కింద నేలకూడా తడిసింది."

దేవ్ కేబిన్‌లో ఆ మూలకి వెళ్ళి తల పైకెత్తి చూస్తే రెండు చెక్కల మధ్యనించి ఎండ కనిపించింది.

"వెస్లీ చెప్పింది నిజం. ఆలివర్ ఇక్కడ ఉండకుండా చావు తప్పించుకున్నాడు. ఉండి ఉంటే ఇద్దరూ చలికి మరణించేవారు" మార్క్ చెప్పాడు.

"మనం వాదనలు ఆపి మిగిలిన పని చూద్దాం" దేవ్ చలికి వణుకుతూ చెప్పాడు.

హార్వే శవాన్ని స్లెడ్జ్ బండిమీదకి ఎక్కించి, దాన్ని ఇద్దరు కలిసి తోసుకుంటూ ఆ పైన్ అడవిలోంచి తీసుకెళ్ళడం ఎంతో శ్రంతో కూడిన పనైంది. దేవ్‌కి ప్రతీ అడుగుకీ తన వయస్సు గుర్తొచ్చింది. ఆయన మార్గదర్శిగా ముందుకి నడుస్తూంటే మిగిలిన వాళ్ళు ఆయన్ని అనుసరించారు. మధ్య మధ్యలో ఒకరు అలసినా ఇంకొకరి స్థానం తీసుకుంటూ ఆ బండిని తోయసాగారు. త్వరగా ఆ శారీరక శ్రమనించి తప్పించుకోవాలని మధ్యలో ఎక్కువసేపు ఎవరూ విశ్రాంతికి ఆగలేదు.

దేవ్ ఇంటి పక్కనించి వాళ్ళు గ్రామంలోకి బండిని తోసుకుంటూ వెళ్తూంటే పోర్చ్‌లోంచి దేవ్ అలసటతో రొప్పుతూ వాళ్ళని చూసాడు.

హార్వే అంత్యక్రియలు పూర్తవకుండానే జూనిపర్ హిల్ గ్రామంలో అతని మరణం గురించి రెండు వర్గాల వాళ్ళు రెండు అభిప్రాయాలని వ్యక్తం చెయసాగారు.

ఆలివర్ ఆలోచనా రహితంగా,  నేరపూరిత నిర్లక్ష్యంతో హార్వేని వదిలి వచ్చాడని, హార్వే మరణానికి బాధ్యత అతనిదే అన్నది మొదటి వర్గం వారి అభిప్రాయం.

రెండో వర్గం వాళ్ళు అతన్ని తప్పుపట్టలేదు. అతని మీద విమర్శ కంటే సానుభూతి అవసరమని రెండో వర్గం వారి అభిప్రాయం.

ఆలివర్ తన కజిన్ హార్వే అంత్యక్రియలకి నిశ్శబ్దంగా, అన్యమనస్కంగా, మూడీగా హాజరయ్యాడు.

హార్వే మరణించిన కొన్ని నెలల తర్వాత చాలాకాలంగా అనారోగ్యంతో బాధపడే ఆలివర్ మేనమామ కాల్విన్ కూడా మరణించాడు. తన ఆస్థిని హార్వే, ఆలివర్ ఇద్దరూ చెరి సగం పంచుకోవాలని, ఒకరు పోతే రెండోవారికి అది చెందుతుందని ఆయన విల్లు రాసాడు. హార్వే జీవించి ఉంటే ఆలివర్‌కి సగమే దక్కేది అని తెలిసిన ఆ గ్రామస్థులు మళ్ళీ హార్వే మరణించిన పరిస్థితులన్నీ పరిగణనలోకి తీసుకుని ఆలివరే కావాలని హార్వేని చంపాడని వాదించసాగారు.

చాలామంది అంతా గౌరవించే డేవ్ దగ్గరకి వెళ్ళి ఆయన అభిప్రాయం అడిగారు కాని ఆయన ఎవరివైపూ మొగ్గకుండా నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

ఆ విషయం ఎవరు ఎత్తినా ఆలివర్ నిరాకరించసాగాడు. కోపంగా, నిశ్శబ్దంగా వారికి దూరంగా వెళ్ళిపోతాడు. చివరికి ఆలివర్ హార్వే వంతు ఆస్థిని కూడా స్వాధీనం చేసుకున్నాడు. కాల్విన్ పక్కమీద ఉండటంతో ఆయన పొలం నిర్లక్ష్యం చేయబడింది. ఆలివర్ చాలా కష్టపడి కంచెని బాగుచేసి, ఎరువులు చల్లి, భూమిని దున్ని, కాలువలని శుభ్రం చేసాక అది అతనికి లాభం తెచ్చిపెట్టసాగింది.

హార్వే మరణించి దాదాపు ఏడాది గడిచాక ఓ రోజు గ్రామస్థులు ఆలివర్ కనపడటంలేదని గ్రహించారు. అతని కట్టెల షెడ్ బయట కట్టెలని దింపాక వాటిని లోపల పెట్టుకోమని చెప్పడానికి దాన్ని తెచ్చినతను ఆలివర్ కోసం అతని ఇల్లు, పొలమంతా వెదికాడు. కాని అతని జాడలేదు.

జూనిపర్ హిల్లోని జనరల్ స్టోర్స్‌కి వచ్చి అతనా విషయం ఆ గ్రామ పెద్దలకి చెప్పాడు. ఐతే దాని గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు కాని జిమ్ అనే అతను రెండు రోజుల తర్వాత ఆలివర్ షెడ్ బయట కట్టెలమీద మంచు పేరుకుని ఉందని, వాటిని అతను షెడ్లోకి చేర్చలేదని ఆ పెద్దలకి చెప్పాడు.

వాళ్ళు పోలీసులకి ఫిర్యాదు చేసారు. ఆ ఊరి కానిస్టేబుల్ ఆలివర్ ఇంటికి వెళ్ళాడు. ముందు తలుపు తాళం వేసి లేదు. ఇంట్లో లేడు. అటకమీద కాని, సెల్లార్లో కాని లేడు. అతని కోసం గ్రామస్తులు వెదకదలచుకున్నారు.

సెర్చ్ పార్టీ డేవ్ ఇంటికి వెళ్తే కొన్ని వారాలుగా అతను తన దగ్గరకి రాలేదని ఆయన చెప్పాడు. అప్పటికే వాళ్ళు చుట్టుపక్కల కొన్ని మైళ్ళ పరిధిలో వెదికి చూసారు. మంచు కురుస్తూండటంతో దాన్ని విరమించుకుని డేవ్ దగ్గరకి వెళ్ళారు. డేవ్ అందరికీ కాఫీ కలిపి ఇచ్చాడు. వాళ్ళంతా ఆలివర్ ఏమయ్యాడు? ఎక్కడికి వెళ్ళాడు? అని ఆలోచిస్తూంటే డేవ్

అకస్మాత్తుగా లేచి గోడకి వేలాడే కేలండర్ దగ్గరకి వెళ్ళి చూసాడు. ఆయన దాని ముందు ఆలోచనగా చాలాసేపు నిలబడి చూస్తూండటం సెర్చ్ పార్టీ వాళ్ళంతా గమనించారు.

"ఈ వాతావరణంలో కష్టంకాని మరోసారి పైన్ అడవిలోని ఆ పాత కేబిన్‌లోకి వెళ్ళి చూడండి" దేవ్ సూచించాడు.

అంతా మొహం చిట్లించారు.

"నాకు అది తెలుసు. అక్కడికి వెళ్దాం పదండి" కానిస్టేబుల్ లేస్తూ చెప్పాడు.

వాళ్ళు తిరిగి వచ్చేసరికి చీకటి పడుతోంది. కానిస్టేబుల్ దేవ్ ఇంటి తలుపుని తట్టాడు. దేవ్ దాన్ని తెరిచాక అంతా లోపలికి నడిచి ఫైర్ ప్లేస్ దగ్గరకి చేరుకున్నారు. కానిస్టేబుల్ దేవ్‌ని ప్రశ్నించాడు.

"ఆలివర్ ఆ కేబిన్‌లో ఉండచ్చని మీకు ఎలా తెలిసింది?"

"తేలిగ్గా తెలుసుకున్నాను. నాలుగురోజుల క్రితం ఆలివర్ మాయమైన రోజు, ఏడాది క్రితం హార్వేని ఆలివర్ ఆ కేబిన్‌లో వదిలి ఇక్కడికి వచ్చిన రోజు.. ఎలా పోయాడు?"

"అదే  బంక్ మీద పడుకుని అలాగే గడ్డకట్టి మరణించాడు. రేపు స్లెడ్జ్ తెచ్చి తీసుకెళ్తాం" కానిస్టేబుల్ బాధగా చెప్పాడు.

ఆలివర్ అంత్యక్రియలకి అంతా హాజరయ్యారు. మళ్ళీ గ్రామస్థుల్లో రెండు అభిప్రాయాలు ఏర్పడ్డాయి.

'అతని ఆత్మహత్య అతను నేరస్థుడని సూచిస్తోంది' అని ఓ వర్గంవాళ్ళు భావించారు.

గ్రామస్థులు అతన్ని విమర్శించడం వల్లే అతను వేదనకి, అవమానానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు తప్ప నేరస్తుడు కాదని రెండోవర్గం వారు భావించారు.

అంత్యక్రియలు అయ్యాక దేవ్ తన ఇంటికోసారి రమ్మని వెస్లీ, మార్క్, జాక్‌లని ఆహ్వానించాడు.

ఆ సాయంత్రం ఆ ముగ్గురూ దేవ్ బ్రాందీ కలిపి ఇచ్చిన కాఫీని తాగుతూంటే జాక్ చెప్పాడు.

"చలికాలంలో తాగాల్సిన కాఫీ ఇది. థాంక్స్ దేవ్."

కొద్దిసేపటికి దేవ్ విషయానికి వచ్చాడు.

"ఆలివర్ నేరస్తుడా లేదా అమాయకుడా అన్న దానిమీద ఇంతదాకా నేను నోరు మెదపలేదు. నేను ఇప్పుడు చెప్పేది మీరు ఎవరికీ చెప్పనని మాట ఇస్తే మీకు కొన్ని విషయాలు చెప్తాను."

"నువ్వు చెప్పేది ఈ గది దాటి బయటకి వెళ్లదు దేవ్" వెస్లీ అందరి తరపునా హామీ ఇచ్చాడు.

దేవ్ వాళ్ళ వంక కొద్దిగా ఆలోచనగా చూసి, కాఫీ ఓ గుక్క తాగి, చిన్నగా నిట్టూర్చి చెప్పాడు.

"ఆ బంక్‌లో గడ్డకట్టి మరణించిన హార్వేని చూసినప్పుడు మీ ముగ్గురూ నాతో ఉన్నారు. అది ప్రమాదవశాత్తు జరిగిన మరణమని మీ ముగ్గురు భావించారు. నడుము విరగడంతో కదలలేక హార్వే లేచి కట్టెలని ఫైర్ ప్లేస్‌లో వేయలేకపోయాడని మీరు అనుకున్నారు. లేదా నిద్రలో గడ్డకట్టి మరణించాడని కూడా. అవునా?"

ముగ్గురూ అవునన్నట్లుగా తలలు ఊపారు.

"కాని నేను అక్కడ కొన్నిటిని గమనించాను. మొదటిది కట్టెల పెట్టెలో కింద ఉన్న సగం కట్టెలు పొడిగా ఉన్నాయి. రెండోది కట్టెల మీద సీలింగ్‌లో నీరు కారే రంధ్రాలేమీ లేవు. అవి ఇంకో మూల ఉన్నాయి. అక్కడ నేలంతా కూడా తడిగా ఉంది. ఆ తడి మధ్య కట్టెపుల్ల ముక్కలు, బెరళ్ళు కనిపించాయి. అంటే కొంతసేపు అక్కడ కట్టెలని ఉంచి ఉండాలి."

"అంటే ఆలివరే కావాలని ఆ పనిచేసాడా?" జాక్ వెంటనే ఉలిక్కిపడి అడిగాడు.

"అనే అనుకుంటున్నాను. ఆ రాత్రంతా నిప్పులో వేయడానికి సరిపడేన్ని కట్టెలు అప్పటికే కట్టెల పెట్టెలో ఉన్నాయి. వాటి మీద మళ్ళీ కట్టెలు తెచ్చి వేయాల్సిన అవసరం నాకు కనపడలేదు. ఆలివరే ఆ తడి కట్టెలని అక్కడికి చేర్చాడు. తను వెళ్ళిపోయాక అవి నిప్పుని మండించలేవని నమ్మాడు. హార్వే పడుకుని కాలినొప్పినించి తప్పించుకోవాలని కోరుకుంటాడు. అవి తడి కట్టెలని తెలిసాక లేచి వాటన్నిటినీ తీసి పక్కన పడేసేందుకు నించోలేడు. ఆ తడి చెక్కలు నిప్పులు రాజేస్తాయనే ఆశతో వాటి ఫైర్ ప్లేస్‌లో ఉంచాడు. కాని ఆ తడికి ఆ కట్టెలు అంటుకోకుండా ఆరిపోయి ఉండటం మనం చూసాం."

"తన మేనమామ ఆస్థి మొత్తానికి వారసుడు అవాలని ఆలివర్ ఈ దుర్మార్గం చేసాడా?" మార్క్ ప్రశ్నించాడు.డేవ్ దీర్ఘంగా నిట్టూర్చి చెప్పాడు.

"అవును అనుకుంటాను. బహుశ తన మేనమామ విల్లులో ఏం రాసుందో ఆలివర్‌కి అప్పటికే తెలుసు. ఆయన ఎక్కువ కాలం జీవించడని, మొత్తం ఆస్థి తనకే చెందాలని ఆలివర్ ఆశపడి ఉంటాడు. అందుకోసం హార్వేని తొలగించడానికి వచ్చిన ఆకస్మిక అవకాశాన్ని ఉపయోగించుకున్నాడు."

"కాని ఏ కోర్టూ దీన్ని హత్యగా అంగీకరించదు" మార్క్ చెప్పాడు.

"అది నాకు తెలుసు. ఆలివర్‌కి  కూడా. అందుకే ఆ దుశ్చర్యకి ఒడిగట్టాడు. అతను కోరుకున్నట్లుగా మొత్తం ఆస్థికి వారసుడైనా స్వతహాగా మంచివాడైన ఆలివర్ తన దుర్మార్గంతో రాజీపడి జీవించలేకపోయాడు. ముఖ్యంగా గ్రామస్థులు తనని నిందిస్తూంటే ఆ నేరం అతని మనస్సాక్షిని పదే పదే పొడుస్తూండి వుండాలి. దాంతో అతను హార్వే మరణించిన సరిగ్గా ఏడాది తర్వాత ఆ చల్లటి అడవిలోకి నడిచివెళ్ళి అతను మరణించిన పద్ధతిలోనే మరణించి తన నేరానికి తనే శిక్షని విధించుకున్నాడు" డేవ్ విషాదంగా చెప్పాడు.

ఎవరూ మాట్లడలేదు. వెస్లీ బ్రాంది సీసా అందుకుని అందరి కప్పుల్లో కొద్దిగా పోసి చెప్పాడు.

"ప్రతీ నేరస్థుడికీ శిక్షపడటానికి కోర్ట్, సాక్ష్యం, జూరీ సభ్యులు,లాయర్లు, తలారీల అవసరం ఉంటుంది. చేసినదానికి శిక్ష పడటం అంటే ఆ పాపాన్ని తుడిచేయడమే. ఇప్పుడు ఆలివర్ మంచివాడు కాబట్టి ఇక అతని గురించి చెడ్డగా మాట్లాడే హక్కు మనలో ఎవరికీ లేదు. ఈ విషయం ఇంతటితో ముగిద్దాం."

కప్పుల్లోని బ్రాందీని తగ ముగ్గురు లేచి బయటకి నడిచారు.

**(వచ్చేనెల మరో కథ)**

Post your comments